సాక్షి
మంచిర్యాల

సోమవారం, 10 ఏప్రిల్ 2023




నమాజ్ చేద్దాం రండి..!
ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం.. 8లో▸



సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ ఆధీనంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఒక్కో తరగతికి 40 మందిని ఎంపిక చేయనున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /26.3

వాతావరణం
ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతాయి. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.



చేతికొస్తున్న ధాన్యం

- జిల్లాలో ప్రారంభమైన వరి కోతలు
- ఖరారు కాని కొనుగోలు ప్రణాళిక
- కేంద్రాలు ప్రారంభించేదెప్పుడో
- ఆలస్యమైతే కొనుగోళ్లలో జాప్యం
- గత అనుభావాలతో తేరుకోని అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి వరి కోతలు మొదలయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడి రైతుల చేతికి వస్తోంది. వారం రోజులుగా హార్వెస్టర్లతో పొలాలు కోస్తున్నారు. అయితే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. జిల్లాస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామస్థాయిలో నిర్వాహకులు గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ఈసారి రాకుండా తీసుకునే చర్యలు వివరించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. కానీ, ఓ వైపు ధాన్యం దిగుబడి వస్తున్నా.. అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ఒకేసారి పెద్ద మొత్తంలో రైతులు ధాన్యం తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ధాన్యం సేకరణ తూకం, గన్నీ సంచులు, రవాణా తదితర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. గతేడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అవస్థలు పడ్డారు. 15 నుంచి 20 రోజులు ధాన్యం ఆరబోసి కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. హమాలీలు అందుబాటులో ఉండకపోవడం, గన్నీ సంచుల కొరత, రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడ్ సమస్య, రవాణాకు లారీల కొరత సమస్యలు తలెత్తాయి. కొన్ని మండలాల్లో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


హాజీపూర్ మండలం పెద్దంపేటలో వరి కోస్తున్న హార్వెస్టర్

జిల్లాలో సాగు విస్తీర్ణం గతేడాది, ఈఏడాది ధాన్యం సేకరణ

వివరాలు	గత ఏడాది	ఈ ఏడాది
సాగు విస్తీర్ణం	76,426 ఎకరాలు	96,104 ఎకరాలు
సేకరించిన ధాన్యం	1,13,080 మెట్రిక్ టన్నులు	2.25 లక్షల(లక్ష్యం) మెట్రిక్ టన్నులు
గన్నీ సంచులు	47 లక్షలు	56 లక్షలు
అందుబాటులో	--	27 లక్షలు

పెరిగిన సాగు విస్తీర్ణం..
గత యాసంగిలో 76,426 ఎకరాల్లో వరి సాగుచేయగా, 1,13,080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. ఈ ఏడాది 96,104 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. దిగుబడి పెరగనున్న దృష్ట్యా ఆమేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఆకాల వర్షాలు కురుస్తాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించి వచ్చిన ధాన్యం వచ్చినట్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పది రోజులుగా కోతలు..
డిసెంబర్ నెలలో నాట్లు వేసిన రైతులు పది రోజులుగా వరి కోతలు ప్రారంభించారు. యాసంగిలో ఎక్కువగా దొడ్డు రకం, స్వల్పకాలిక రకాలు సాగుచేయడంతో మూడు నెలల్లోనే పంట చేతికి వస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ఎండలు మండుతున్నాయి. తేమ శాతం కూడా ఎక్కువగా వచ్చే అవకాశం లేదు. దిగుబడి వచ్చిన ధాన్యాన్ని ఇంటి వద్దనే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తు ప్రణాళికేది?
యాసంగి ధాన్యం సేకరణపై అధికారులు యాక్షన్ ప్లాన్ ఇప్పటికీ రెడీ చేయలేదు. వానాకాలంతో పోల్చితే యాసంగిలో ధాన్యం దిగుబడి పెరుగుతుంది. కొనుగోలు కేంద్రాలకు కూడా ఎక్కువగా వస్తుంది. కొన్నేళ్లుగా ఏప్రిల్ చివరన భారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. రెండేళ్లుగా లారీలు, గన్నీ సంచుల కొరత ఏర్పడుతోంది. గత అనుభావాల దృష్ట్యా ఇప్పటికైనా అధికారులు ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి ఏజెన్సీల నిర్వాహకులకు అవగాహన కల్పించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..



యాసంగిలో సాగుచేసిన వరిపంట కోతకు వచ్చింది. హార్వెస్టర్‌తో కోసి మూడు రోజులవుతోంది. ఎండలు మండుతున్నాయి. తేమ శాతం కూడ తక్కువగానే ఉంది. కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో ఎదురు చూడాల్సి వస్తుంది. త్వరగా ప్రారంభించాలి.
– పొట్టాల శంకర్‌గౌడ్, రైతు, హాజీపూర్ మండలం

ఆదేశాలు రాగానే..
కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం సేకరణపై కమిషనరేట్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వ్యవసాయ, ఏజెన్సీలు, మిల్లర్లతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రెండు మూడు రోజుల్లో సమావేశం నిర్వహిస్తాం. ఆదేశాలు రాగానే గ్రామాల వారీగా కేంద్రాలు ప్రారంభిస్తాం.
– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

- డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్


మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మంచిర్యాలక్రైం: సీపీఆర్ విధానంతో కార్డిక్ అరెస్ట్ అయ్యేవారి ప్రాణాలు కాపాడవచ్చని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో గుండెపోటు, విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతీ ఉద్యోగికి సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైన ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదంలో ఉన్న వ్యక్తి గుండె ఆగిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్న వ్యక్తి గుండె తిరిగి కొట్టుకోవడం ప్రారంభమవుతోందన్నారు. దీనినే గోల్డెన్ అవర్ అని అంటారని పేర్కొన్నారు. ఈ సమయంలో వెంటనే వైద్యం అందితే బాధితులు ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్‌పై శిక్షణ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మనో ధైర్యం కలిగించి ప్రథమ చికిత్స అందించాలని, అనంతరం అంబులెన్స్‌లో గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. తర్వాత పోలీస్ అధికారులకు బీపీ, షుగర్, ఈసీజీ, పీఎఫ్‌టీ, 2డీఇకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, స్థానిక మెడిలైఫ్ హాస్పిటల్ వైద్యులు చౌహన్, కుమార్‌స్వామి, శ్రీనివాస్ సిరిపురం, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు, రూరల్ సీఐ సంజీవ్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ నరేశ్‌కుమార్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి


జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మందమర్రిరూరల్: ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మికి ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందించారు. మందమర్రిలోని జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి జీతాలు సరిపోక కుటుంబ పోషణ భారమైందని తెలిపారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జేఏసీ చైర్మన్ రమేశ్, ఏపీవో మల్లయ్య, ఈసీ విలాస్, సీవో మహేందర్, టీఏ నరేశ్, శృతి తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ఏరియా అభివృద్ధికి టెండర్ పూర్తి

కాసిపేట: సింగరేణి సంస్థ కేకే ఓసీపీ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెంకు సంబంధించి పెద్దనపల్లి శివారు ఆర్‌అండ్‌ఆర్ సైట్‌లోని 32 ఎకరాలలో అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ఈనెల 5న టెండర్ అవార్డు చేసినట్లు మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. సైట్‌లో డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సరఫరా మొదలగు అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేయాలని సివిల్ డిపార్టుమెంట్, సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికులపై పనిభారం


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ మంచిర్యాల డిపో కార్మికులపై అధికారులు అధిక పనిభారం మోపుతున్నారని, అక్రమ చార్జిషీట్లు, సస్పెన్షన్లకు పాల్పడుతున్నారని కార్మికులు ఎమ్మెల్యే దివాకర్‌రావుకు ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. ఏ డిపోలో లేని విధంగా సింగిల్ క్రూ డ్యూటీల పేరిట 8 గంటలకు బదులు 14 గంటలు పనిచేయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇంటీరియల్ ఓటీ డ్యూటీలు దహెగాం, శివ్వారం, వేమనపల్లి, తిర్యాని, ఆవడం ఓటీ డ్యూటీలు తక్షణమే స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగా చేయాని కోరారు. కండక్టర్, డ్రైవర్ల కొరత పేరుతో బంధువులు మృతిచెందినా, కుటుంబ అవసరాలున్నా లీవ్‌లు ఇవ్వడం లేదని తెలిపారు. చార్జిషీట్ ఇస్తూ ఇంక్రిమెంట్లు ఆపేస్తున్నారని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్టీసీ డాక్టర్ వద్దకు వెళ్లితే సిక్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మద్యం తాగకున్నా తాగినట్టు బ్రీత్ ఎనలైజర్ చూపిస్తుందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రమేశ్, కళ, గోలి శంకర్, కేఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

'బలగం' చూసిన ఎమ్మెల్యే


బలగం సినిమా చూస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని గౌతమినగర్, 26, 27వ వార్డుల్లో ఆదివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గౌతమినగర్‌లో ఎమ్మెల్యే దివాకర్‌రావు సినిమా ప్రదర్శనను ప్రారంభించి స్థానికులతో కలిసి సినిమా చూశారు. భారీ తెరపై ప్రదర్శించిన సినిమాను వీక్షించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 26, 27వ వార్డుల కౌన్సిలర్లు నాంపల్లి మాధవి శ్రీనివాస్, పద్మ, కొండల్‌రావు ఆధ్వర్యంలో సినిమా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస్, ఆనందరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు ముప్పు

- ఓసీపీల్లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రైవేటీకరణ కారణంగా రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లుతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా పీపుల్స్ మార్చ్ పేరిట చేపట్టిన పాదయాత్ర జైపూర్ మండలం రామారావుపేట మీదుగా ఆదివారం మంచిర్యాల నియోజకవర్గంలోకి ప్రవేశించింది. సింగరేణి క్షేత్రమైన శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అంతకు ముందు దారి మధ్యలో సింగపూర్ గ్రామం వద్ద శ్రీరాంపూర్ ఓసీపీని భట్టి సందర్శించారు. నిర్వాసితులు ఆయనను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రజల సంస్థగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడానికి కుట్ర చేశాయని ఆరోపించారు. ఈమేరకు గతంలో బీజేపీ ప్రభుత్వం చేసిన చట్టానికి బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు నాలుగు బొగ్గు బ్లాకుల వేలానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని పేర్కొన్నారు. ప్రైవేటీకరణతో పర్మినెంట్ ఉద్యోగాల్లో వర్తించే ఆర్‌ఓఆర్ ప్రైవేట్, కాంట్రాక్ట్ పనుల్లో వర్తించదని తెలిపారు. దీంతో ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు దక్కడం లేదని అన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

సింగరేణి అంటే ఉద్యోగాల గని..
సింగరేణి అంటే ఒకప్పుడు ఉద్యోగాల గని అని పేరుండేదని, ప్రభుత్వాల తీరుతో అది పోయిందన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఓసీపీల్లో ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించింది కాంగ్రెస్ ప్రభుత్వం అయితే వాటిని అమ్ముతున్నది బీజేపీ ప్రభుత్వం అన్నారు. సింగరేణిని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. సింగపూర్, ఓసీపీ, జీఎం కార్యాలయం ఫ్లైఓవర్ మీదుగా శ్రీరాంపూర్ ప్రగతి మైదానానికి భట్టి యాత్ర చేరుకుంది. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిట్ల సత్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్లు తెనుగు లావణ్య, బొద్దున సంధ్యారాణి, గెల్లు రజిత, శ్రీపతి సుమతి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డె రాజమౌళి, నాయకులు ఖాలిద్, వొడ్నాల రాజన్న, తోట కిష్టయ్య పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన ప్రేంసాగర్‌రావు, సురేఖ

సమస్యలు వింటూ ముందుకు..
జైపూర్: సీఎల్పీనేత మల్లు భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 22వ రోజు ఆదివారం జోరుగా సాగింది. స్వల్ప విరామం తర్వాత జైపూర్ మండలం ఇందారం సమీపంలోని దుబ్బపల్లి క్యాంపు నుంచి రామారావుపేట మీదుగా గుత్తెదారిపల్లి నుంచి పాదయాత్ర సాగింది. ప్రజల సమస్యలు వింటూ రాబోవు రోజుల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అంటూ ఇందిరమ్మ రాజ్యం వచ్చాక అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భరోసానిస్తూ ముందుకు సాగారు. దారిమధ్యలో సింగాపూర్, తాళ్లపల్లి, గుత్తెదారిపల్లి గ్రామాల ప్రజలు తమ భూములు, ఇళ్లను సింగరేణి తీసుకుందని, యువకులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని తెలిపారు. మూడు గ్రామాల్లో సుమారు వెయ్యి మంది ఉద్యోగం, ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్‌కాస్టు పనులు చేస్తున్న అధికార పార్టీనేత చల్ల ధర్మారెడ్డి స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని తెలిపారు.


చిన్నారిని లాలిస్తున్న భట్టి విక్రమార్క

పేదల అభ్యున్నతే బీఆర్‌ఎస్ లక్ష్యం

- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు

నస్పూర్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని మాజీ ఎమ్మెల్సీ, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల ఆత్మీయ సమ్మేళనాల సమన్వయకర్త నారదాసు లక్ష్మణ్‌రావు తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విపక్షాలకు ఎన్నికలు అంటే గేమ్ అని, బీఆర్‌ఎస్‌కు మాత్రం టాస్క్ అని పేర్కొన్నారు. నాయకులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్ బలం.....
కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా వాటిని తిప్పికొట్టి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు సమష్టిగా పని చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు, వేదికపై ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు..

వారసత్వ ఉద్యోగాల ఘనత బీఆర్‌ఎస్‌దే..
సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, నాయకులు మంద మల్లారెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పంబాల గంగ, చిదం మహేశ్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాలు పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు మొదటి విడత ఇళ్ల పట్టాలు సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్హత కలిగిన పుర ప్రజలకు ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు.

టేకులపల్లిలో ఆత్మీయ సమ్మేళనం..
కన్నెపల్లి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చిన్నయ్య తెలిపారు. టేకులపల్లి గ్రామ శివారులోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమ్మేళనానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమి పరాధీనం

- ఆక్రమించి అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాలలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు మళ్లీ జోరందుకున్నాయి. అక్రమార్కులు రాత్రికి రాత్రే భూములు కబ్జాచేస్తున్నారు. అనుమతి లేకుండానే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. విలువైన ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా, అనుమతి లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల కనుసన్నల్లో ఈ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సర్వే నంబర్ 112పై కబ్జాదారుల కన్ను..
బెల్లంపల్లి శివారు కన్నాల ప్రాంతంలోని సర్వే నంబర్ 112లో ఉన్న ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. కొన్ని రోజులుగా ఈ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారు. ఈ భూమి దశాబ్దాలపాటు సింగరేణి ఆధీనంలో ఉంది. ఐదేళ్ల క్రితం సింగరేణి యాజమాన్యం ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించింది. ఏడాదిపాటు ఆ స్థలం జోలికి ఎవరూ వెళ్లలేదు. తర్వాత ఏటా కొంత ఆక్రమణకు గురవుతూ వస్తోంది. తాజాగా మిగిలిన కొద్దిపాటి స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు.


ఆక్రమిత ప్రభుత్వ భూమిలో కట్టిన ఇళ్లు

ప్లాట్లు చేసి.. కంచె వేసి..
112 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ప్లాట్లుగా చేసి.. దాని చుట్టూ కంచె కూడా వేశారు. అంతటితో ఆగకుండా ఎలాంటి అనుమతి లేకుండా ఏకంగా నిర్మాణాలు మొదలు పెట్టారు. సమీపంలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఉండడంతో పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ భూమి దాదాపు కబ్జా అయిపోయింది. అయినా ప్రభుత్వ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

అక్రమ నిర్మాణం కూల్చినా..
మూడు నెలల క్రితం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వెనుక ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి జేసీబీతో కూల్చి వేశారు. ఆ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఇప్పుడు కొంతమంది శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. రాత్రి పగలు తేడా లేకుండా పనులు జరుగుతున్నాయి. అక్రమంగా నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణాలకు గ్రామపంచాయతీ నుంచి ఇంటి నంబర్ తీసుకుని ఆ నంబర్ ఆధారంగా విద్యుత్ మీటర్ పొందేలా కబ్జాదారులు ప్రయత్నాలు కూడా మొదలు పెట్టారని సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



కన్నాల శివారు సర్వే నంబర్ 112లో కొందరు ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదు అందింది. ముందస్తుగా ఆ ప్రాంతాన్ని సందర్శించి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం. ఆక్రమణదారులు ఎంతటివారైనా వదిలిపెట్టం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని కాపాడుతాం.
– కుమారస్వామి, తహసీల్దార్, బెల్లంపల్లి

ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుక


పతాకావిష్కరణ చేస్తున్న ఆదర్శ్‌వర్ధన్ రాజు

బెల్లంపల్లి: కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ వేడుకలను బెల్లంపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్‌రాజు యూనియన్ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై, విద్యార్థుల ఇబ్బందుల పరిష్కారానికి ఎన్‌ఎస్‌యూఐ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ, విద్యార్థులను ఐక్యం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సెలర్ గుజ్జ రవి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'బలగం' రైటర్ రమేశ్‌కు సన్మానం



రమేశ్‌ను సన్మానించిన కరస్పాండెంట్

మందమర్రిరూరల్: బలగం సినిమా కథ రచయిత రమేశ్‌ను మందమర్రిలోని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ పోలు శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం సుజాత అభినందించారు. ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రమేశ్ తమ పాఠశాలలో చదువుకున్నాడని చెప్పడం గొప్పవిషయమన్నారు. చిన్నప్పటి నుంచే రమేష్‌కు సినిమాలపై మక్కువ ఎక్కువగా ఉండేదని, సినీ ఫీల్డ్‌కి వెళితే రాణించలేవని చెప్పేవాడినని గుర్తు చేశారు. ఈ రోజు ×బలగం₹ సినిమాకి రైటర్‌గా రాణించి తెలంగాణ ప్రజల మన్ననలు పొందడం గర్వించతగిన విషయమన్నారు. భగత్‌సింగ్ యూత్, విశ్వబ్రాహ్మణ సంఘం, పలువురు స్వచ్ఛంద సంస్థల వారు, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రమేశ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

నవజాత శిశువుకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం శిశువుతో దంపతులు, వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నవజాత శిశువుకు విజయవంతంగా ఆపరేషన్ చేసి వైద్యులు ప్రాణం పోశారు. కోటపల్లి మండలం నాగంపేట గ్రామానికి చెందిన పద్మ–సురేశ్ దంపతులు. మొదటి కాన్పుకు మంచిర్యాలలోని మ్యాక్స్ కేర్ ఆస్పత్రికి వచ్చారు. పద్మకు స్కాన్ చేయగా గర్భంలోని శిశువు కడుపులో 10 సెంటిమీటర్ల ఓవెరియన్ సిస్ట్ ఉందని గుర్తించారు. పద్మకు వారం క్రితం ఆస్పత్రిలో సుఖ ప్రసవం అనంతరం పాప జన్మించింది. ఆ శిశువుకు వైద్యులు లక్ష్మి, నాగరాజు, సాయికృష్ణ, సతీశ్‌ల ఆధ్వర్యంలో శనివారం రెండు గంటల పాటు శ్రమించి విజయవంతంగా కడుపులోని సిస్ట్‌ను తొలగించారు. మహానగరాల్లో నిర్వహించాల్సిన ఆపరేషన్ స్థానికంగా చేయడంతో తల్లిదండ్రులు పద్మ–సురేశ్‌లు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వారిని ఇంటికి పంపించారు.

టిప్పర్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుంటాల(కె) గ్రామం వద్ద ఆదివారం టిప్పర్ బోల్తా పడడంతో ప్రమాదం తప్పింది. నిర్మల్ నుంచి కంకర లోడ్‌తో వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా కుంటాల ఘాట్స్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయి జనావాసాలు ఉండే ప్రాంతంలో బోల్తా పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.



నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

అజాన్ ఇస్తున్న ముస్లిం

నమాజ్ చేద్దాం రండి..!

కెరమెరి(ఆసిఫాబాద్): ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. రోజుకు ఐదుసార్లు మసీదుల నుంచి మైక్‌ల్లో ఈ పిలుపు వినపడగానే ముస్లింలు నమాజ్‌కు సన్నద్ధమవుతారు. అప్పటి వరకు చేస్తున్న పనులను పక్కనపెట్టి పవిత్ర హృదయాలతో మసీదుకు బయలుదేరుతారు. రోజు ఐదుసార్లు మసీదు నుంచి వెలువడే వాణినే అజాన్ అంటారని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అజాన్‌పై ప్రత్యేక కథనం!

- అజాన్‌కు ఘన చరిత్ర
- ప్రవక్త మెచ్చిన పిలుపు
- మసీదు నుంచి వెలువడే దివ్యవాణి
- రంజాన్ మాసం ప్రత్యేకం



ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

అజాన్ ఇలా మొదలైంది.

మహ్మద్ ప్రవక్త, ఆయన అనుచరులు మక్కాలో ఉన్నంత కాలం తాము ఉంటున్న ఇంటిలోనే నమాజ్ చేసేవారు. అల్లా ఆజ్ఞ ప్రకారం మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు వలసవెళ్లారు. మదీనా చేరిన వెంటనే అక్కడ నమాజ్ చేయడానికి వీలుగా మసీదు నిర్మాణం చేపట్టారు. అయితే ముస్లింలను ఎలా ఆహ్వానించాలనే ప్రశ్న తలెత్తింది. శంఖం ఊదితే బాగుంటుందని కొందరు.. కాగడా వెలిగిద్దామని మరికొందరు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అందులో అబ్దుల్లాబీన్ జైద్ వచ్చి ×నేను ఒక కల గన్నాను. నమాజ్ కోసం అందరిని పిలుస్తున్నా..₹ అని అజాన్ గురించి వివరించారు. ×అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లాహి లాహి ఇల్లల్లాహి₹ అని ఆయన లయబద్ధంగా పాడి వినిపించారు. ఈ పదాలు ప్రవక్తకు నచ్చడం, అంతలోనే దైవవాణి (వహీ) కూడా అవతరించడంతో అబ్దుల్లాబిన్ జైద్‌కు వచ్చిన స్వప్నం నిజమని ప్రవక్త ధ్రువీకరించారు. మహ్మద్ ప్రవక్త జైద్‌ను పిలిచి అజాన్ పలుకులను హజ్రత్ బిలాల్ (రజీ) కు నేర్పించాలని సూచించారు. అలా మొదటి సారి అజాన్ హజ్రత్ బిలాల్ పలికారు. ఈ పిలుపు వినగానే ముస్లింలు నమాజ్ చేయాలనే ఉద్దేశంతో మసీదుకు తరలివచ్చారు.

నమాజ్‌కు రావాలనే భావన ఉంది.

అజాన్‌లో అల్లా గొప్పతనం, నమాజ్ ప్రాముఖ్యత ప్రధానంగా ఉంటుంది. దైవవాణి వినిపిస్తుంది. అందరూ నమాజ్ కోసం రావాలనే భావనను అజాన్ చెబుతుంది. రోజుకు ఐదుసార్లు అజాన్ ఉంటుంది. సూర్యోదయానికి ముందు చేసేదాన్ని ఫజర్ అని, మధ్యాహ్నం ఇచ్చే పిలుపును జోహర్ అని పిలుస్తారు. సాయంత్రం అసర్, సూర్యాస్తమయంలో మగరేబ్, రాత్రికి ఇచ్చే పిలుపును ఇషా అని వ్యవహరిస్తున్నారు. నమాజ్ కు ముందు అజాన్ ఇవ్వడం తప్పనిసరి. రంజాన్, బక్రీద్ పండుగలకు అజాన్‌లోని ముందు చరణాలను పలుకుతూ ముస్లింలు నమాజ్‌కు వెళ్తారు.

నమాజ్‌కు ప్రాధాన్యం..

నేరడిగొండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండడమే కాకుండా నమాజ్ చదువుతారు. అల్లాహ్ దీవెనల కోసం ఐదుసార్లు నమాజ్‌తో పాటు తరావీ నమాజ్ (ఖురాన్ పఠనం) చేస్తారు. నమాజ్‌లో అల్లాహ్‌ను ప్రార్థించడమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యం, క్రమ శిక్షణ కూడా అలవడుతుందని వారి నమ్మకం. నమాజ్ వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని వారి విశ్వాసం. ముస్లింలు చేసే నమాజ్‌లో తక్బీర్, ఖియాం, రుకూ, సజ్దా, సలాం అనే క్రియలు ఉంటాయి. వాటితో ఎన్నో ఉపయోగాలున్నాయి.

వావ్ అనిపించేలా..





పెన్నుతో గీసిన చిత్రాలు



వాటర్ పెయింట్‌తో గీసిన చిత్రం

- చిత్ర లేఖనంలో రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- విద్యార్థులకు సైతం శిక్షణ
- జాతీయ స్థాయిలో అవార్డు



కలర్ పెన్సిల్స్‌తో గీసిన చిత్రాలు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్‌చారి

దండేపల్లి: అతడు గీసిన చిత్రాలు చిత్తం చెదిరిపోయేలా ఉంటాయి.. పెన్ను, పెన్సిల్, కలర్‌పెన్సిల్స్, వాటర్ కలర్స్, అక్రాలిక్ కలర్స్, క్యాన్వస్ పెయింటింగ్, డిజిటల్ చిత్రాలు గీయడంలో అత్యంత ప్రతిభకనబరుస్తున్నాడు దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు శ్రీరాముల వెంకటేష్‌చారి. చిన్నతనం నుంచే అతడికి బొమ్మలు గీయడం అంటే అమితాసక్తి.. దీంతో అతడి ఆసక్తిని ఆచరణలో పెట్టాడు. కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే విద్యార్థులను చిత్రలేఖనంలో తీర్చిదిద్దడంతో పాటు, తాను కూడా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ డ్రాయింగ్ పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభ చాటుతున్నాడు. ఖాళీ సమయాల్లో రకరకాల పెయింటింగ్ వేయడంతో పాటు పాఠశాలకు వేసవి సెలవుల సమయంలో సినిమాల వైపు దృష్టి మరల్చి సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ ఆర్ట్ సెట్టింగ్‌లకు పనిచేశాడు.

జాతీయ స్థాయిలో అవార్డు..

అంతర్జాతీయ ఆర్టిస్టు శ్రీశేషబ్రహ్మం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కళాయజ్ఞం జాతీయ పోటీల్లో వెంకటేష్‌చారి పాల్గొని అతడు గీసిన చిత్రానికి జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. అమరవీరుల స్మారక స్థూపం రూపశిల్పి, ఎం.వీ రమణారెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశాడు.

మంచి చిత్రకారుడిగా ఎదగాలని..



చిన్నతనం నుంచే బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. దీంతో చదువుతూ, ఖాళీ సమయాల్లో రకరకాల బొమ్మలు గీసేది. దీనికి ఆసక్తితో పాటు ఏకాగ్రత చాలా అవసరం. బీఎడ్‌తో పాటు, ఆర్ట్ విభాగంలో డిప్లమా చేశాను. కాంట్రాక్టు పద్ధతిన ఆర్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పోటీల్లో పాల్గొంటున్నాను. నేను గీసిన చిత్రానికి జాతీయ స్థాయి అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీల్లో పాల్గొని మరిన్ని అవార్డులు సాధించి మంచి చిత్రకారుడిగా పేరుసాదిస్తా.

– శ్రీరాముల వెంకటేశ్‌చారి, ఆర్ట్ ఉపాధ్యాయుడు

'గిరి' గ్రామాల్లో సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంజూరు
- వచ్చే సంవత్సరం ప్రారంభం
- పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నేడు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసేవారు..

జిల్లా	ఆశ్రమపాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	51	2040
ఆసిఫాబాద్	46	1840
మంచిర్యాల	16	640
నిర్మల్	17	680



ప్రశ్న పత్రాలతో సిబ్బంది

ఉట్నూర్: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. బాల,బాలికలకు వేర్వేరుగా ప్రతి జిల్లాకు రెండు ఆశ్రమ పాఠశాలల చొప్పున 8 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 4, 5, 6, 7, తరగతుల్లో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రవేశపరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 36 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బంది లేకుండా ఎంపిక కోసం గిరిజన సంక్షేమ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

ప్రత్యేక బోధన..

ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ఎంపికైన గిరిజన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందించనున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వం ఆయా అంశాల్లో వారిని తీర్చిదిద్దనుంది. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 4, 5, 6, 7 తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశపరీక్ష ఉంటుంది. మొత్తం 5,200 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 5200 మంది గిరిజన విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– జగన్, ఏసీఎంవో, ఐటీడీఏ ఉట్నూర్

టేకు చెట్లు నరికిన ఇద్దరి రిమాండ్

పెంబి: టేకు చెట్లు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణ, డీఆర్‌వో ప్రతాప్ నాయక్ తెలిపారు. ఆరుగురు పరారయ్యారు. వారి కథనం ప్రకారం..పెంబి రేంజ్ పరిధిలోని దోందారి బీట్‌లో ఉట్నూర్ మండలం చిన్న గంగాపూర్‌లో 8 మంది నిందితులు 12 టేకుచెట్లు నరికిన దుంగలను ఉట్నూర్‌కు తరలిస్తున్నారని సమాచారం అందింది. తనిఖీ చేయగా ఆరుగురు పరారయ్యారు. ఇద్దరు నిందితులు టేకం దేవురావ్, ఆరే కన్నయ్యను పట్టుకుని ఆదివారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా..14 రోజులు రిమాండ్ నిమిత్తం నిర్మల్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఎక్సైజోళ్లకే పైసలిస్తున్నం... నువ్వేంజేస్తవ్

- రెచ్చిపోతున్న గుడుంబా విక్రయదారులు



దాడిలో గాయపడిన శివరాం

వేమనపల్లి: ఎక్సైజోళ్లకు వచ్చినప్పుడల్లా డబ్బులు ఇస్తున్నాం. మీరేమిజేస్తరు మమ్మల్ని అంటూ గ్రామాల్లో గుడుంబా విక్రయదారులు రెచ్చిపోతున్నారు. కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని గుడుంబా అమ్మవద్దని అన్నందుకే విక్రయదారులు తనపై దాడి చేశారని గ్రామానికి చెందిన దుర్గం శివరాం విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది నుంచి గ్రామంలో వాడవాడకు గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, యువత నాటుసారా తాగి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని బాధితుడు తెలిపారు. గుడుంబా అమ్మకాలు అరికట్టాలని ఎక్సైజ్ సీఐ, ఎస్సైకి సమాచారం ఇస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. మంచిర్యాల కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని వాపోయాడు. నెలనెలా గుడుంబా విక్రయదారుల వద్దకు వచ్చి మామూళ్లు తీసుకుంటూ గుడుంబా అమ్మకాలకు ఊతం ఇస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో గుడుంబా తయారీ, అమ్మకాలను అరికట్టాలని కోరారు.

'అతిథులకు' జీతాల్లేవ్



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్

- ఆరునెలలుగా అందక ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారం
- ఉమ్మడి జిల్లాలో 186 మంది గెస్ట్ లెక్చరర్లు

వివరాలు

జిల్లాలు	గెస్ట్ లెక్చరర్లు
నిర్మల్	39
ఆదిలాబాద్	53
కుమురంభీం	40
మంచిర్యాల	54
మొత్తం	186

లక్ష్మణచాంద: ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే అందులో అతిథి అధ్యాపకుల పాత్ర వెలకట్టలేనిది. రెగ్యులర్ లెక్చరర్ల మాదిరిగానే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ ప్రక్రియ కొనసాగుతుండటంతో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డచందంగా తయారైంది. 2013 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. గంటకు ప్రభుత్వం రూ.390 చెల్లిస్తోంది. వీరికి నెలకు గరిష్ఠంగా రూ.28,080 ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 186 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ సంబంధించి వేతనాలు విడుదల చేసింది. జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రావల్సి ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ వల్ల నిర్మల్ జిల్లాలో ఇప్పటికే 6 గెస్ట్ లెక్చరర్లు ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఖాళీ ఉన్నచోట గతంలో పనిచేసిన గెస్ట్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలల నుంచి వేతనాలు రాలేదు. కుటుంబాలకు ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి. – జి. సాయినాథ్, గెస్ట్ లెక్చరర్ల సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ భారం



నిర్మల్ జిల్లా ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నా. ఈ విద్యాసంవత్సరంలో జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రాలేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు త్వరగా వేతనాలు ఇప్పించాలి.

– ముత్యం, గెస్ట్ లెక్చరర్

సమస్య పరిష్కరిస్తాం



గతంలో జిల్లాలోని గెస్టు లెక్చరర్ల వేతనాలు డీఐఈవో కార్యాలయం నుంచి పంపేవారు. కాని ఇప్పుడు వారు పనిచేసే కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి ఇస్తారు. రెండు రోజుల్లో వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– పరశురామ్, ఇంటర్ నోడల్ అధికారి

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్ల గురిజాల ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం... బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన పందుల శేఖర్‌తో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రడగంబాల బస్తీకి చెందిన ముక్కెర లక్ష్మి అనే మహిళతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచుగా భార్యాభర్తలకు గొడవ జరుగుతుండేది. నిత్యం తాగివచ్చి భార్యతో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం శేఖర్ హనుమాన్ మాల ధరించి శుక్రవారం విరమణ చేసిన మరుసటి రోజే మద్యంతాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మత్తులో ఇంట్లోని టీవీ, సెల్‌ఫోన్ ధ్వంసం చేశాడు.

భరించే ఓపిక లేక ..

శేఖర్‌లో మార్పు రాక పోవడంతో పాటు మళ్లీ యథావిధిగా తాగడం మొదలుపెట్టడంతో లక్ష్మి తీవ్రమైన మానసిక వేదనకు గురైంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలైన లక్ష్మిని అదే రాత్రి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందింది. ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని కంచరపేట గ్రామంలో ఆదివారం తేనె టీగల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోచమ్మ ఆలయానికి అమ్మవారి దర్శనం కోసం వెళ్లగా తేనె టీగలు దాడి చేయడంతో కొండబోని రమ పరుగెత్తడంతో కిందపడి కాలు విరిగింది. తిరుపతి, భీమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారి విస్తరణలో పక్షపాతం

- జాతీయ రహదారి 63 మంది బాధితులు



మాట్లాడుతున్న జాతీయ రహదారి బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నూతనంగా నిర్మాణం చేపట్టనున్న మంచిర్యాల – ఆర్మూర్ జాతీయ రహదారి 63ప్రణాళిక తయారీలో పూర్తి పక్షపాతం ఉందని జాతీయ రహదారి బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం హాజీపూర్ మండల జాతీయ రహదారి 63 బాధితులు కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న జాతీయ రహదారి ప్రణాళికలో చాలా లోపాలున్నాయన్నారు. గతంలో వచ్చిన రోడ్డు ప్లాన్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందుకుని మార్చినట్లు తెలుస్తోందని అన్నారు. రోడ్డుకు ఒకవైపు నుంచి మాత్రమే వెడల్పు చేయడంతో రోడ్డు పక్కన ఇండ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా భూ సేకరణ చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఎల్లంపల్లిలో ఇండ్లు కోల్పోయి రోడ్డు వైపు వచ్చి ఇండ్లు కట్టుకుని ప్రశాంతంగా ఉన్న తమకు ఈ రోడ్డు వెడల్పులో మరోసారి ఇళ్లు కోల్పోతే తమను ఆదుకునేవారు ఎవరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు, భూపరిహారం ఎంతో తేల్చిన తర్వాతే భూ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారమే పరిహారమే చెల్లించాలని, ఉపాధి కోల్పోతున్న వారికి ఉపాధి కలిపించాలని డిమాండ్ చేశారు. బాధితుల కలిసి మండల జాతీయ రహదారి 63 బాధితుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు మల్లేశ్‌లను ఎంపిక చేస్తూ బాధితుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో ఒడ్డె బాలరాజు, బేర పోచయ్య, లగిశెట్టి రాజయ్య, దొమ్మటి సత్తయ్య, మల్క నగేశ్, రాజేశ్, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, వెంకటేశ్, చారి ఉన్నారు